
www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 20 | మే | 2026 పేజీలు : 8

## ఆగని కోతలు..!

-రైతుల తీవ్ర నిరసన
-చండ్రుగొండలో ధాన్యానికి నిప్పు




# కార్పోరేషన్‌లో.. తలనాడిస్తున్న తోకలు..!






-కబ్జారాయుళ్లతో చేతులు కలుపుతున్న అధికారులు
-ఉన్నతాధికారులకు తప్పడు సమాచారం
-ప్రత్యేకాధికారైన సరైన పర్యవేక్షణ చేస్తారా...?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో కొందరు అధికారుల తీరు మొత్తం కార్పోరేషన్ పాలనను తప్పుదారి పట్టిస్తుంది. కమిషనర్ సహా ఉన్నతాధికారు లందరినీ తప్పుదారి పట్టిస్తూ తోకలు తలనాడించే చందంగా వ్యవహరిస్తున్నారు. ఏ సమాచారం కూడా ఉన్నతాధికారులకు చేరకుండా తొక్కిపడుతూ కార్పోరేషన్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కమిషనర్ నిజాయితీ పరుడైనా కింది స్థాయి ఉద్యోగులపై ఆధారపడడంతో

మిగతా 2లో..

-అనుమతి లేని ఆసుపత్రులతో అవస్థలు
-రోగాల బారిన చెత్త సేకరణదారులు
-మొద్దు నిద్రలో నియంత్రణ అధికారులు




## మున్సిపల్ వ్యర్థాల్లో.. బయో మెడి'కి(క)ల్'..!



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డుల్లో బయో మెడికల్ వ్యర్థాలు పెద్ద ఎత్తున చేరుతున్నాయి. నగరంలోని నలుమూలలా ఏ డొమెస్టిక్ డంపింగ్ యార్డులో చూసినా దవాఖానల నుంచి తీసుకువచ్చిన మెడికల్, కెమికల్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దవాఖానల నుంచి వ్యర్థాలను సేకరించడానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రత్యేకంగా 'కామన్ బయో మెడికల్ వెస్ట్ ట్రిట్‌మెంట్ ఫెసిలిటీ' ఏర్పాటు చేసింది. అయినప్పటికీ సంబంధిత తనిఖీలు

మిగతా 2లో..

## బడి బాట సాగేదెట్లా..?




-90 శాతం ఉపాధ్యాయులు జనగణన విధుల్లోనే..
- లక్ష్యాలు చేరుకునేనా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా జనగణన 2027 సర్వే ముమ్మరంగా సాగుతోంది. 90 శాతం మంది ఉపాధ్యాయులు జనాభా లెక్కల సేకరణ విధుల్లో తలమునకలై పనిచేస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా సం.కు సంబంధించి బడిబాట షెడ్యూల్ విడుదల చేసింది. గతంలో పాఠశాలలు తెరిచే రెండు మూడు రోజులకు ముందు బడిబాట చేపట్టి జూన్ 15నాటికి ముగించే వారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచేందుకు రాష్ట్రం ప్రభుత్వం ఈ సారి బడిబాటని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యావారోత్సవాలను నిర్వహించిన ప్రభుత్వం అప్పటి నుండి జూన్ 19వ తేది వరకు బడిబాట నిర్వహించాలని నిర్ణయించింది. ఓ ప్రక్క జనగణనలో 90 శాతం మంది ఉపాధ్యాయులు ఉండగా కేవలం 10 శాతం మందితో బడిబాట లక్ష్యాలు ఎలా సాధిస్తామంటూ ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకున్నారు.

**జూన్ 19 వరకు..**

విద్యావారోత్సవాలను పురస్కరించుకుని మే 14 నుండే బడిబాట ప్రారంభించి జూన్ 19 నాటికి ముగిసేలా షెడ్యూలు తయారు చేశారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బడులకు వెళ్లి శుభ్రం చేయించి

మిగతా 2లో..

# కార్పోరేషన్‌లో తలనాడిస్తున్న తోకలు..!

(మొదటిపేజీ తరువాయి)

అనేక మంది కార్పోరేషన్ బాధితులుగా మారుతున్నారు. ముఖ్యంగా భూ కబ్జాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే కమిషనర్ దగ్గర నుంచి సంబంధిత అధికారులకు చేరకుండా ఓ ఉద్యోగి తన వద్దే ఫైల్స్‌ను ఉంచుకుంటున్నారని పైగా ఎవరిపై ఫిర్యాదు చేశారో వారిని పిలిచి దొడ్డిదారి మంతనలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇది కలకలం రేపుతుంది. బాధితులు కొందరు కార్పోరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగానే ఎవరి పై ఫిర్యాదు చేశారో వారు సంబంధిత ఉద్యోగులతో సంప్రదింపులు జరిపి పక్కదారి పట్టిస్తున్నారు. ఎన్నెస్పి కాలువలను తిరిగి కొందరు ఆక్రమిస్తున్నారు. విలువైన ప్రదేశాల్లో ఉన్న ఈ కాలువల భూములలో భవనాలు నిర్మిస్తుండడంతో ఇటీవల కొందరు దీనిపై ఫిర్యాదు చేశారు. వెంటనే ఫిర్యాదు చేసిన వారిని వదిలి ఎవరు ఆక్రమించుకుంటున్నారో వారిని కార్పోరేషన్‌కు పిలిపించి మీ పని మీరు చేసుకోండి అని భరోసా ఇచ్చినట్లు సమాచారం. దీనితో ఫిర్యాదు చేసిన తర్వాత సదరు వ్యక్తి పనులను వేగవంతం చేస్తున్నాడు. గతంలోనూ ఇటువంటివి అనేకం చోటు చేసుకున్నాయి. ఓ వ్యక్తి వ్యాపార అనుమతులు లేకుండానే ఆరేండ్ల పాటు వ్యాపారం నిర్వహించి ప్రభుత్వానికి ఎటువంటి పన్ను చెల్లించకుండా కార్పోరేషన్‌లో కొందరికి మాముళ్లు ఇస్తూ వ్యాపారం నిర్వహించడం అందరికీ తెలిసిన విషయమే. ఉన్నతాధికారులు కార్పోరేషన్‌పై పట్టు కోల్పోతున్నారు. ఏ శాఖలో ఏమి జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితి. ఏ మీడియాలోనైనా కార్పోరేషన్‌కు సంబంధించిన వ్యతిరేక వార్తలు రాగానే వారిని కార్పోరేషన్ గ్రూపుల నుంచి తొలగించడం తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మీడియా ప్రతినిధులను కార్పోరేషన్ వైపు రాకుండా చూడటం కొందరికీ ప్రవృత్తిగా మారింది. గతంలో కార్పొరేటర్లు మేయర్ ఉన్నప్పుడే పరిస్థితి ఆవిధంగా ఉంటే ఇప్పుడు ఉద్యోగులు మరింత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

**లీక్ ప్లానింగ్ :**

ఖమ్మం కార్పోరేషన్‌లో ఇప్పుడు లీక్ ప్లానింగ్ అద్భుతంగా నడుస్తుంది. ఎవరైనా భవన నిర్మాణాలకు దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలించిన తర్వాత అందులో ఉన్న లోపాలను కొందరికీ తెలియజేసి భవన నిర్మాణదారుల దగ్గరకు పంపుతున్నారని అధికారులే మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఇది అత్యంత పకడ్బందీగా ఒక ప్రణాళికాబద్ధంగా సాగుతుంది. భవన నిర్మాణంలో చిన్న చిన్న లోపాలను కొందరికి తెలియజేస్తూ సమాచార హక్కు చట్టం క్రింద దరఖాస్తు చేయాలని ప్రోత్సహించడం లేదా అధికారులే దీనిపై తమకు ఫిర్యాదులు వచ్చాయని ఫలానా నెంబర్‌తో మాట్లాడుకోండి అంటూ నిర్మాణదారులకు తెలియజేస్తున్నారని ఈ లీక్‌ల పర్వం భారీ వసూళ్లకు దారి తీస్తుంది.

**ప్రత్యేకాధికారైనా దృష్టిపెట్టేనా :**

ఖమ్మం కార్పోరేషన్‌లో పాలక వర్గ పదవి కాలం ముగియడంతో ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్ ప్రస్తుతం ప్రత్యేకాధికారిగా ఉన్నారు. గతంలో జరిగిన లోపాలపైనా ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారాలపైన కార్పోరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ దృష్టిసారించాల్సి ఉంది. కొందరు అధికారులు స్థాయికి మించి వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యంగా కార్పోరేషన్‌లో పెరిగిన ప్రభుత్వ భూముల కబ్జాపైన ప్రత్యేక విచారణ జరిపించాలని కార్పోరేషన్ ప్రజలు కోరుతున్నారు. కార్పోరేషన్ పాలనను సరిదిద్దే క్రమంలో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మున్సిపల్ వ్యర్థాల్లో బయో మెడి'కి(క)ల్'..!

(మొదటిపేజీ తరువాయి)




నిర్వహించక పోవడం, అనధికార ఆసుపత్రులపై చర్యలు తీసుకోకపోవడంతో వీరు యధేచ్చగా బయో మెడికల్ వ్యర్థాలను రోడ్ల వెంట, డంపింగ్ యార్డు ల్లో పడేస్తున్నారు. కొన్ని అనధికార ప్రవేట్ ఆసుపత్రులు, ఆర్ ఎంపీలు, పిఎంపీలు చెత్తను సేకరించే వాహన సిబ్బందికి ఎంతో కొంత డబ్బు ముట్టజెప్పి బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ డంపింగ్ యార్డుల్లో పారవేయిస్తున్నారు. ఈ బయోమెడికల్ వ్యర్థాలు గృహ వ్యర్థాలతో కలిసి మరింత దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. వీటిలో సూదులు, సిరంజీలు, పగిలిన సీసాలు, కుల్లినశరీర అవయవాలు, గాయాలకు డ్రెస్సింగ్ చేసిన దూది, సెలైన్ బాటిల్స్, మూత్రపు పైపులు, మాస్కులు, చేతి గ్లౌజులు, డైపర్లు ఇతరత్ర డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్నాయి. వీటితో పాటు పదునైన సర్జికల్ బ్లేడ్‌లు డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్నాయి. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి ఎంలాటి తనిఖీలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

**-పర్యావరణానికి పెనుముప్పు...**

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయంగా చేపట్టాల్సి ఉంటుంది. వాటిని బహిరంగ ప్రదేశాల్లో, గృహ వ్యర్థాలతో కలిపి పారబోయడం అత్యంత ప్రమాదకరం. దవాఖానల్లో వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం ద్వారా బయో వ్యర్థాలు పోగుపడతాయి. వీటిలో గాజు సీసాలు, సూదులు, దూది, మాస్కులు, చేతి గ్లౌజులు, రక్త పరీక్ష పరికరాలు, సెలైన్ బాటిల్స్, వైర్లు, పిపిఈ కిట్లు, శానిటరీ నాప్‌కిన్‌లు ఉంటాయి. వీటని జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు2016 ప్రకారం సురక్షితంగా, శాస్త్రీయంగా నిర్వహించాల్సి ఉంటుంది. కానీ దవాఖానాల యాజమాన్యాల నిర్లక్ష్యంతో ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాలలో పడేస్తున్నారు. ఇలా బయో మెడికల్ వ్యర్థాలలో ఉండిపోయిన కొన్ని రకాల బ్యాక్టీరియా, వైరస్ రోగ కారకాలకు వ్యర్థాలను తొలగించే సిబ్బందికి సంక్రమించే ప్రమాదం ఉంటుంది. వీటిని తొలగించే క్రమంలో సూదులు, ఫ్లోర్‌సిప్‌లు కుచ్చుకొని పారిశుద్ధ్య కార్మికులు ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడుతున్నారు. అదేవిధంగా వాటిలోని రసాయనాలు, బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల గాలి, నీరు, నేల కలుషితమవుతున్నాయి. వాటిని తొలగించే క్రమంలో సిబ్బందికి హెపటైటిస్, హెచ్‌ఐవి, టిబి వ్యాధులు సంక్రమించే ప్రమాదాలు కూడా ఉన్నాయి.

**-తనిఖీలు చేపట్టాలి**

బయో మెడికల్ వ్యర్థాలను దవాఖానల నుంచి సేకరించే వాహనాలు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉన్నాయి. వీటిలో వివిధ రకాల వ్యర్థాలను స్టెరలైజ్ చేసేందుకు ఏర్పాట్లు ఉంటాయి. ఆయా వాహనాలు జిపిఎస్ ట్రాకర్‌తో అనుసంధానంమై ఉంటాయి. వీటిని నిర్వహించే ఏజెన్సీ వారు కాలుష్య నియంత్రణ మండలిలో వాహనాల రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటారు. వీటిని నిరంతరం అన్ని దవాఖానాల్లో చెత్తను సేకరిస్తుంటాయి. ఇందుకు దవాఖానాలు నిర్వహణ ఖర్చు వారికి ఉన్న బెడ్స్‌వారిగా నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బు ఇవ్వకుండా తప్పించుకునేందుకు దవాఖానాలు బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లో వేస్తున్నారు. వీరితో ఆర్‌ఎంపిలు, పిఎంపిలు కూడా ఇదే దారిలో నడుస్తున్నారు. దీంతో అవన్ని డంపింగ్ యార్డులోక్లి పెద్ద ఎత్తున చేరి పర్యావరణంలోకి చేరి చెత్త సేకరణ సిబ్బందికి హానీ కలిగిస్తున్నాయి. ఇలాంటి బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. దవాఖానాలు గృహ వ్యర్థాల డంపింగ్ యార్డుల్లో రాండమ్ తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఖమ్మం పరిధిలో అలాంటి తనిఖీలు ఎంత మాత్రం జరగడం లేదని విమర్శలున్నాయి. దీంతో పర్యావరణ కాలుష్యంతో పాటు, పారిశుద్ధ్య సిబ్బంది రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఖమ్మం నగరవాసులు కోరుతున్నారు.

# ఓటర్లు తమ పేర్లను జాబితాలో సరి చూసుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** 2002లో ఓటు హక్కు ఉన్నవారు ప్రస్తుత ఓటర్ జాబితాలో వారివారి పేర్లు ఉన్నది లేనిది సరిచూసుకోవాలని ఐటిడిఏ డిడి అశోక్ అన్నారు. మంగళవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఐటిడిఏలోని వివిధ శాఖల అధికారులు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి సూచనల మేరకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలే పేర్లు సరిచూసుకుని లేని వారు సంబంధిత ఆధారాలతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తమ పేర్లతో పాటు కుటుంబీకులు, చుట్టు ప్రక్కల ఉన్న వారి పేర్లను కూడా సరిచూసి మ్యాపింగ్ ప్రక్రియ చేయించే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం భద్రాచలంలో సమగ్రఓటర్ సవరణ ప్రారంభిస్తున్నారని, ఆ సమయంలో బిఎల్‌ఓలు వారి పరిధిలో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి వివరాలు సేకరిస్తున్నారని అన్నారు. ఏవైనా సందేహాలు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, ఇఇ మధుకర్, ఆర్‌సిఓ అరుణ్, ఎస్‌డిసి ఆనంద్, పివిటిజి గన్యా, మణిధర్, లక్ష్మీనారాయణ, ఆదినారాయణతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆగని కోతలు..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పండించిన ధాన్యాన్ని విక్రయించడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులకు కోతలు ఇప్పుడు మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందాన్ని తలపిస్తున్నాయి. రోజుల తరబడి ధాన్యం విక్రయ కేంద్రాల్లో తల్లడిల్లుతున్న రైతులను మిల్లర్లు అందిన కాడికి దోచుకుంటున్నారు. చింతకాని మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి రైసుమిల్లులకు ఎగుమతి చేసిన ధాన్యం విషయంలో క్వింటాకు 10 కేజీల కోత విధిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి కొనుగోలు చేయకుండా తాత్సరం చేసి అటో ఇటో తిప్పలుపడి కాంటాలు వేయించి ఎగుమతి చేస్తే రైసుమిల్లర్లు క్వింటాకు 10 కేజీల కోతకు ఒప్పుకుంటేనే దిగుమతి చేసుకుంటాం లేదంటే తీసుకెళ్లవచ్చు అంటూ రైతులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రెండు నెలలుగా ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తుండడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగం ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రుగొండ మండలంలో రైతులు జాతీయ రహదారిపై ధాన్యం పోసి నిప్పంటించారు. పెద్ద సంఖ్యలో రైతులు చేరుకుని నిరసనకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది. అధికారులు త్వరిత గతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అధికారులు మాత్రం కోతలు విధించిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు తప్ప ఆచరణలో మాత్రం చర్యలు శూన్యం. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియా సాక్షిగా హెచ్చరించినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని కోతలు విధిస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బడి బాట సాగేదెట్టా..?

(మొదటిపేజీ తరువాయి)

తోరణాలు కట్టి పిల్లల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇక్కడితో సమస్య తీరలేదు. ఈ నెల 21వ తేదిన అంగన్వాడీ టీచర్లు, మదర్స్ కమిటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. 28న యువతతో పాటు స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. జూన్ 3వ తేదిన గ్రామసభ, 4వ తేదిన అవగాహన గ్రామసభ ఏర్పాటు చేయాలి. 5వ తేదిన పిల్లలను గుర్తించడం, 6వ తేదిన బడిబయటి పిల్లలను గుర్తించడం, 8 నుండి 10వ తేది వరకు ఇంటింటి ప్రచారం. జూన్ 12న తేదిన పాఠశాలలు పునః ప్రారంభం ఆహ్వానం దినం, 15న సామూహిక అక్షరాభ్యాసం. 16న ఎఫ్‌ఎల్‌ఎన్ డే, 17న బాలికల ఎడ్యుకేషన్ డే, 18న సాంకేతిక అవగాహన కార్యక్రమం, 19న స్పోర్ట్స్ డే కార్యక్రమాలతో బడిబాట ముగియనుంది.

**బడిబాటలో పాల్గొనండి..**

జనగణన విధుల్లో లేని ఉపాధ్యాయులంతా తప్పని సరిగా బడిబాట కార్యక్రమంలో పాల్గొనాల్సిందే అంటూ ప్రధానోపాధ్యాయులు అదేశాలు జారీ చేశారు. తక్కువ సంఖ్యలో బడిబాట నిర్వహిస్తే లక్ష్యాలను చేరుకోలేమని ఉపాధ్యాయులను నుండి ప్రశ్నలు మొదలయ్యాయి.

**హాజరు శాతం పెంచేందుకు..**

ప్రభుత్వ బడుల్లో హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం బడిబాటకు ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రాన్ని నిరక్షరాస్యతా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రణాళికలు రచించారు. ఇందులో భాగంగా పిల్లలు బడికి వెళ్లేందుకు ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రానికి సరఫరా చేశారు. మరో ప్రక్క బడి తెరిచే లోపే పాఠ్యపుస్తకాలతో పాటు నోటుపుస్తకాలు ప్రక్క ఏకరూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బడి పిల్లలకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఏర్పాట్లను ఇప్పట్నుంచే మొదలు పెట్టారు.

**బడిబాటను విజయవంతం చేయండి : నాగలక్ష్మీ ,జిల్లా విద్యాధికారి**

ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలి. జనగణన విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు మినహాయించి మిగతా వారంతా ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి.

## వివోఏల నిరవధిక సమ్మెతో నిలిచిపోయిన సభలు, సమావేశాలు, లావాదేవీలు




**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని ఐకెపిలో సమ్మెతో సభలు, సమావేశాలు, లావాదేవీలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని 29 గ్రామ సమైక్యలలో స్వయం సహాయక సంఘాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, అవగాహన సదస్సులు, సభలు మండల సమైక్యకు అందించాల్సిన లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్వయం సహాయక సంఘాలు వారు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని 1500 గ్రూపులలోని సభ్యులకు స్త్రీ నిధి బ్యాంకు లింకేజీ స్వయం సహాయక సంఘాల సభ్యులకు హక్కులు బాధ్యతలు పై అవగాహన సదస్సులు జీవనోపాదుల కొరకు ప్రత్యేక రుణాలు పూర్తిగా నిలిచిపోవడంతో మహిళా సంఘ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. నెలకు 20,000 వేతనం అందించాలని హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, వివో ఏ లకు అర్హతను బట్టి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా వివోఏలు సంఘం జేఏసీ పిలుపుమేరకు నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వివో ఏ లు కోరుతున్నారు.

# ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలి

## ప్రజా దర్బార్ సమీక్షలో కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వారం రోజుల్లోగా నివేదిక పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా దర్బార్ దరఖాస్తులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన కలెక్టర్, దరఖాస్తులు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నాయి..? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారు..? అనే విషయాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీస్తూనే, వాటి వేగవంతమైన పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు అందించారు. మూడు క్లస్టర్ల పరిధిలో వచ్చిన 686 దరఖాస్తులను క్షుణ్ణంగా, దరఖాస్తుల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా దర్బార్ దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు ఏ ఒక్క దరఖాస్తు కూడా తిరస్కరణకు గురికాకుండా (రిజెక్ట్ అవ్వకుండా) సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించగా, వాటిని తక్షణమే పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, డి.టి.కనకం నరసింహారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్ రావు, అల్లం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల వివాదం

## 15 రోజుల్లో నివేదికతో ఢిల్లీకి రావాలి ఖమ్మం అధికారులకు ఎస్టీ కమిషన్ ఆదేశం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బుగ్గపాడు పోడు భూముల విషయంలో 96 మంది గిరిజనులపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసుల వ్యవహారంపై జాతీయ ఎస్టీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై 15 రోజుల్లో పూర్తి నివేదికతో న్యూఢిల్లీలో హాజరుకావాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి, జిల్లా అటవీశాఖ అధికారికి కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అటవీ, పోలీసు అధికారుల దౌర్జన్యాలపై సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన కురం మహేంద్ర కుమార్ కమీషన్‌కు ఫిర్యాదు చేయగా, దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ ఈ మేరకు చర్యలు తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ ప్రకారం కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలు ఉన్నాయి. గడువులోగా



నివేదిక ఇవ్వకపోతే సమన్లు జారీ చేసి వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుందని కమిషన్ రీజినల్ డైరెక్టర్ డా. పి. కళ్యాణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఫైల్ నెం. ఎన్ సి ఎస్ టి/ఏటిఆర్‌వై3806/టిఎస్/1157/2026ఆర్ ఓబిహెచ్ యూ వి/ఆర్ యూ3 ప్రకారం, ఆరోపణలపై తీసుకున్న చర్యలపై 15 రోజుల్లో వాస్తవాలు, సమాచారం సమర్పించాలని కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలను కమిషన్ ఆదేశించింది. గడువులోగా సమాధానం ఇవ్వకపోతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ ప్రకారం సివిల్ కోర్టు అధికారాలతో సమన్లు జారీ చేసి వ్యక్తిగతంగా లేదా ప్రతినిధి ద్వారా హాజరుకావాల్సి ఉంటుందని నోటీసులో హెచ్చరించింది.

# వరి కొయ్యలను కాల్చొద్దు.. భూసారాన్ని కాపాడుకుందాం

## వైరా ఏసిపి సారంగపాణి

**ప్రజాపక్షం/వైరా:** వరి కొయ్యలకు కాల్చవద్దు భూసారాన్ని కోల్పోవద్దు పర్యావరణాన్ని పాడుచేయవద్దని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ వరి కొయ్యలకు నిప్పు పెట్టడం ద్వారా భూమి వేడికి భూసారాన్ని కోల్పోవడంతో పాటు పర్యావరణానికి చాలా ప్రమాదం అలా చేయవద్దని రైతులకు సూచించారు. భూసారం కోల్పోతే పంటల దిగుబడి కూడా తగ్గుతుంది. దానివలన భూగర్భ జలాలు కూడా తగ్గే ప్రమాదం ఉందని ఆయన గుర్తు చేశారు. వరి కొయ్యలు కాల్చడం వలన భూముల్లో ఉన్న వానపాములు నశించిపోతాయి, భూసారం తగ్గుతుంది. మంచి బలాన్ని ఇచ్చే పోషకాలు గాలిలో కలిసిపోతాయి. ఎరువులు ఎక్కువ ఉపయోగించాల్సి వస్తుంది. దాంతో ఖర్చు పెరుగుతుంది. గాలిలో కాలుష్యం పెరిగి ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. కాల్చడం ద్వారా వచ్చే దట్టమైన పొగ రోడ్ల ప్రక్కన వెళ్లేటప్పుడు ప్రమాదాలకు కారణం అవుతుందని అన్నారు.

### రైతులకు పలు సూచనలు...

రైతులకు ఏసిపి సారంగపాణి పలు సూచనలు చేశారు. పంట వ్యర్థాలను భూమిలో కలియదుండాలి. నీటిలో ముురగ పెట్టాలి. సేంద్రీయ ఎరువుల యొక్క ఉపయోగించుకోవాలి, పర్యావరణానికి అనుకూలంగా నూతన వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి. భూమిని దున్నాలి, అన్నదాతలు వారి ఆరోగ్యం భూమి భవిష్యత్తు



పర్యావరణ పరిరక్షణ కోసం వరి కొయ్యలను వ్యర్థ పదార్థాలను కాల్చకుండా ఉండాలని సూచించారు.

### పక్క రైతులకు ఇబ్బంది కలించవద్దు

రైతులకు ఏసిపి సారంగపాణి పలు సూచనలు చేశారు. పంట వ్యర్థాలను భూమిలో కలియదుండాలి. నీటిలో ముురగ పెట్టాలి, సేంద్రీయ ఎరువుల యొక్క ఉపయోగించుకోవాలి. పర్యావరణానికి అనుకూలంగా నూతన వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి. భూమిని దున్నాలి, అన్నదాతలు వారి ఆరోగ్యం భూమి భవిష్యత్తు పర్యావరణ పరిరక్షణ కోసం వరి కొయ్యలను వ్యర్థపదార్థాలను కాల్చకుండా ఉండాలని సూచించారు.

### పక్క రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

వరి కొయ్యల వ్యర్థ పదార్థాలు కాల్చడం ద్వారా పక్క పొలాల రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని, అలా ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలి. చుట్టుప్రక్కల రైతులు కూడా ఆనందంగా ఉండాలి అనే నినాదం ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

# రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేత

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ వ్యవసాయ యంత్రాలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ మండలంలో తైవాన్ స్ప్రేయర్ 61, రోటోవేటర్లు 14, రోటోపట్లర్లు 2, వరిగడ్డి కట్టే మిషన్లు 3, ఇతర ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్ అందించడం జరిగింది. మండలంలోని మొదటిసారిగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఆదుకోవడం జరిగిందని తెలియజేశారు. ధాన్యాన్ని కూడా పూర్తిగా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలోమ ఒడల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, మార్కెట్ చైర్మన్ గంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మపల్లి కరుణశ్రీ, వైరా మండల వ్యవసాయ అధికారి మయాన మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారులు వాసంతి, సైదులు, కీర్తి, వెంకటనరసయ్య,మేడా రాజేష్, మార్కెట్ చైర్మన్ గంగారావు,



డాక్టర్ కాపా మురళీకృష్ణ, దొడ్డా పుల్లయ్య, ముళ్ళపాటి సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 2026 27 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతి, ఐదవ తరగతుల్లో ప్రవేశాల కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్ కులాల విద్యార్థిని, విద్యార్థుల దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జి. జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు ఒకటో తరగతి (నాన్ రెసిడెన్షియల్ , డే స్కాలర్స్)లో 128 సీట్లు, ఐదవ తరగతి (రెసిడెన్షియల్ )లో 131 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షల లోపు ఉండాలని, తల్లిదండ్రులు డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ చదువుకుని ఉంటే అనర్హులని స్పష్టం చేశారు. ఒకటో తరగతి ప్రవేశం కొరే విద్యార్థులు 2020 జూన్ ఒకటి నుంచి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను మే 20 నుంచి జూన్ ఆరు వరకు ఖమ్మం కలెక్టరేట్‌లోని షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు పొంది తగిన ధృవీకరణ పత్రాలతో జూన్ ఆరున సాయంత్రం ఐదు గంటల లోపు అదే కార్యాలయంలో సమర్పించాలన్నారు.

# ఆన్‌లైన్ అవగాహన విజయవంతం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యువత కోసం నిర్వహించిన ప్రత్యేక ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం విజయవంతమైనట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన క్రీడావారోత్సవాల్లో రెండవ రోజు మంగళవారం యువత కోసం ప్రత్యేక ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల నైపుణ్య శిక్షణ కోర్సులు క్రీడా విశ్వ విద్యాలయం (స్పోర్ట్స్ యూనివర్సిటీ), నైపుణ్య విశ్వవిద్యాలయం (స్కిల్ యూనివర్సిటీ), భారత ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై నిపుణులు అవగాహన కల్పించారు. యువత తమ భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని యువత ఆసక్తిగా వీక్షించారు.



# గ్రామ పంచాయతీ స్థలం ఆక్రమణ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్న సంఘటన మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గతేడాది గ్రామ పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేశాడు. ఆ సమయంలో ఆక్రమణను గుర్తించిన పంచాయతీ కార్యదర్శి ఫెన్సింగ్ తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు హెచ్చరిక బోర్డులు తొలగించి ఆ స్థలంలో సదరు వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడు తుండ టం గ్రామంలో చర్చనీయాంశమైంది. నిత్యం అధికారులు ప్రజాప్రతినిధులు తిరిగే గ్రామ పంచా యతీ కార్యాలయ సమీపంలోనే స్థలం ఆక్రమణకు గురికావడం, ఇంటి నిర్మాణం చేపడుతున్న చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన స్థలం ఆక్రమణకు గురి కావడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ఆక్రమణను తొలగించి స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.



# సమ్మర్ క్యాంపును సందర్శించిన డాక్టర్ సుష్మ

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి పిఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల నందు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును మంగళవారం మడుపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుష్మా, హెల్త్ సూపర్వైజర్ లంకా కొండయ్య సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి పలు ఆరోగ్య సూచనలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ముఖ్యంగా ఎండ దెబ్బ తగలకుండా ఉండాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీరు తరచుగా త్రాగాలన్నారు. కూల్ డ్రింక్స్, ఇతర రసాయనిక కృత్రిమ పానీయాలను తీసుకోకుండా ఉండాలని, చెరువులు, నదుల దగ్గరకు ఈతకు వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. అలాగే సమ్మర్ క్యాంపులో నేర్చే రైటింగ్ స్కిల్స్, డ్యాన్స్ స్కిల్స్ చక్కగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, బాజోజు జ్ఞానేశ్వరాచారి, పైడిపల్లి కిషోర్, డి.సుగుణరావు, కె.నాగరాజు, తాళ్ళూరి మాధురి, సీత తదితరులు పాల్గొన్నారు.



# టిజిఆర్‌జెఎస్ ఫలితాల్లో మనోన్వితకు స్టేట్ ర్యాంక్

**ప్రజాపక్షం/ మధిర :** మంగళవారం ప్రకటించిన టిజిఆర్‌జెసి ఫలితాల్లో మధిర డివిజన్లో భరత్ స్కూల్ విద్యార్థిని కెవి.మనోన్విత అత్యంత ప్రతిభ కనబర్చి స్టేట్ 8వ ర్యాంకు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ శీలం విద్యాలతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ స్కూల్లో చదివే విద్యార్థులు పబ్లిక్ పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయి ర్యాంక్‌ను సాధించిన మనోన్వితను ఆమెతో పాటు ప్రిన్సిపాల్ జె.కోటేశ్వరరావు, టి.ఉమా, ఇంచార్జి కటికల రవీందర్‌రెడ్డి, బి.స్రవంతి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



## మొక్కజొన్న స్టాక్ పాయింట్లను తనిఖీ చేసిన డీఎం



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలోని మొక్కజొన్న స్టాక్ పాయింట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎం జే నరేందర్ మంగళవారం తనిఖీ చేశారు. అప్పాయిగూడెం గోదాం, జిన్నింగ్ మిల్ స్టాక్ పాయింట్లను డీఎం పరిశీలించారు. సోమవారం రాత్రి కారేపల్లిలో రైతులు ఆందోళనకు దిగటంతో విషయం తెలుసుకున్న వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ రైతు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కారేపల్లి మండల రైతుల మొక్కజొన్నను స్థానికంగా దిగుమతి చేయటానికి అవకాశాలు పరిశీలించాలని కలెక్టర్‌ను ఎంఎల్‌ఏ రేరారు. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ డీఎం గోదాంలను పరిశీలించారు. ఈసందర్భంగా సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, దుగ్గికృష్ణలు జిన్నింగ్ మిల్లు స్టాక్ పాయింట్‌లో కారేపల్లి మండల రైతుకలు అవకాశం కల్పించాలని డీఎంను కోరారు. వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్‌తో ఫోన్‌లో డీఎంతో మాట్లాడి స్థానిక రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. డీఎం వెంట సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

## మొక్కజొన్న దిగుమతులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన మొక్కజొన్న బస్తాల దిగుమతిలో జాప్యం వల్ల రైతులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ తెలిపారు. మంగళవారం కారేపల్లి జిన్నింగ్ మిల్లులో స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన రైతులు, డ్రైవర్లతో మాట్లాడారు. స్థానిక రైతుల ట్రాక్టర్లు, లారీలకు అవకాశం కల్పించాలని, ఏకకాలంలో ఎక్కువ పాయింట్లలో దిగుమతులు చేపట్టాలని కోరారు. దిగుమతి కేంద్రంలో మంచినీటి సౌకర్యం కల్పించి, కొనుగోళ్లపై ఎంఎల్‌ఏ ప్రతి రోజూ సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ డీఎంకు సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, కార్యదర్శి వజ్జా రామారావు, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి భూముల వివాదంలో రైతులకు హైకోర్టు ఊరట

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామ రైతులకు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. చట్టబద్ధమైన భూసేకరణ ప్రక్రియ లేకుండా రైతులను భూముల నుంచి బలవంతంగా తొలగించవద్దని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. రైతులు తరపున సర్పంచ్ గుమ్మడి సందీప్ చొరవతో హైకోర్టును ఆశ్రయించారు. తమ వద్ద పట్టాదార్ పాసు బుక్‌లు, ఆర్ఓఆర్ పత్రాలు ఉన్న భూములకు అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు కోర్టుకు తెలిపారు. భూమి స్వాధీనం, పునరావాసం, పునరుద్ధరణలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం 2013 ప్రకారం భూసేకరణ జరపకుండానే జోక్యం చేసుకోవడం చట్ట విరుద్ధమని రైతులు తరపు న్యాయవాదులు వాదించారు. సింగరేణి సంస్థ మాత్రం భూముల రక్షణ కోసం మాత్రమే ఫెనింగ్ పనులు చేపట్టినట్లు కోర్టుకు తెలిపింది. రెండు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రతివాదులు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను జూన్ 22, 2026 కు వాయిదా వేసింది. అప్పటి వరకు చట్ట ప్రకారం తప్ప రైతులను భూముల నుంచి తొలగించరాదని స్పష్టం చేసింది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సిబ్బంది విధి నిర్వహణ. సమయపాలనను కచ్చితంగా పాటిస్తూ, విధులకు సమయానికి హాజరవుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడమటి నర్సాపురం సబ్ సెంటర్ ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్లో సిబ్బంది హాజరు పట్టికలు, రిజిస్టర్లు పరిశీలించి, డ్రై డే కార్యకలాపాలను మానిటర్ చేశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో సమావేశమై, ప్రస్తుత కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామస్థులకు తగిన అవగాహన కల్పిస్తూ, వ్యాధి నివారణ చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

# ట్రా'ఫికర్'..!

-కరకగూడెంలో భయం భయం..!
-మండల కేంద్రంలో రోడ్డు ఆక్రమణలు
-ఫుట్ పాత్‌లు మాయం.. రోడ్డుపైనే నడక...
-మార్కెట్లు ఉన్నా రహదారి మీదనే వ్యాపారం
-చోద్యం చూస్తున్న అధికారులు







**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కేంద్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ, ట్రాఫిక్ నిర్వహణలో విఫలమవుతున్న దృశ్యం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విస్తరిస్తున్న రహదారులు, పెరుగుతున్న వాహనాల సంఖ్య ఒక వైపు ఉంటే.. నియంత్రణలేని ఆక్రమణలు, మండల ఉన్నత అధికారుల ప్రణాళికల లోపం మరోవైపు కరకగూడెం గ్రామానికి అస్తవ్యస్తంగా మార్చుతున్నాయి. రహదారి పరిధిలో పరిస్థితి రోజురోజుకూ విషమిస్తోంది. రహదారి ఇరు వైపులా సరైన పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తు న్నారు. దీంతో రహదారి వెడల్పు తగ్గిపోగా, ట్రాఫిక్ గందరగోళం తీవ్రమవుతోంది. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులు నెలకొన్నాయి.

### ఎంపీడీవో ఆఫీస్...

మండలం సమస్యలకు కేంద్రబిందువుగా ఎంపీడీవో ఆఫీస్ పక్క సర్కిల్ మారింది. ఇప్పటికే ఇరుకైన రహదారిపై వ్యాపారులు రోడ్డుపైనే వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు, ప్రజలు, వ్యాపారాలు కలిసి తీవ్ర రద్దీని సృష్టిస్తున్నాయి. ప్రతి అడుగులో ప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రంలో కూరగాయలు, పండ్ల మార్కెట్ల కోసం ప్రత్యేక సముదాయాలు ఉన్నప్పటికీ, చాలా మంది వ్యాపారస్తులు అక్కడికి వెళ్లకుండా రోడ్లపైనే వ్యాపారం చేస్తున్నారు. ఇది నియమాల ఉల్లంఘన మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోంది.

### ఫుట్ పాత్ లు మాయం...

పాదచారుల కోసం నిర్మించిన ఫుట్ పాత్‌లు ఇప్పుడు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. వ్యాపారస్తులు పూర్తిగా ఆక్రమించుకోవడంతో ప్రజలు రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. వాహనాల రద్దీ మధ్య నడపడం ప్రమాదకరంగా మారింది. ఇక మరోవైపు పార్కింగ్ కోసం కేటాయించిన ప్రదేశాలు కూడా ఆక్రమణల పాలవుతున్నాయి. చిన్న వ్యాపారస్తులు ఈ స్థలాలను ఆక్రమించుకోవడంతో వాహనదారులు ఎక్కడైనా ఖాళీ కనిపిస్తే అక్కడే వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో కరకగూడెం సెంటర్లో పార్కింగ్ వ్యవస్థ పూర్తిగా గందరగోళంగా మారింది.

### నియంత్రణలోకి రాని ట్రాఫిక్...

ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్‌లు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆక్రమణలు, అవగాహన లోపం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. మూల కారణాలను తొలగించకుండా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడం కష్టమే. ఇది ఇలా ఉంటే ప్రజలు మాత్రం అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్ పాత్ ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

### తక్షణ చర్యలు తీసుకోండి....

ఫుట్ పాత్ లను ఆక్రమించిన వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ స్థలాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని, కరకగూడెం సెంటర్లో సర్కిళ్ళు ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారిని మార్కెట్ సముదాయాలకు తరలించాలని కోరుతున్నారు. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు కాదు... ప్రజల భద్రత కూడా ముఖ్యమే. సమస్యను ఇప్పుడే పరిష్కరించకపోతే, కరకగూడెం ప్రమాదాల నగరం గా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పంచాయితీ తీర్మానం లేకుండానే సైడ్ డ్రైన్ల నిర్మాణం

-గంగ బండ తండా గ్రామంలో అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని గంగ బండ తండాలో పంచాయితీలో ఎటువంటి తీర్మానం లేకుండానే రావిచెట్టు తండాలో సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ సమావేశంలో చర్చించకుండా, సభ్యుల ఆమోదం పొందకుండా పనులు ప్రారంభించడం నిబంధనలకు విరుద్ధమని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో చేపడుతున్న సైడ్ డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి అధికారిక తీర్మానం లేకపోవడంతో పాటు, పనుల వివరాలు, అంచనా వ్యయం, నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలకు సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టడం వెనుక ఏదైనా అక్రమం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశంతో నాసిరకం సామాగ్రి ఉపయోగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా ఉండేందుకు సరైన ప్రణాళికతో పనులు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణం భవిష్యత్తులో సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ తీర్మానం లేకుండా ప్రభుత్వ నిధులతో పనులు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, పనుల పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయితీ అనుమతి లేకుండా పనులు ఎందుకు..ప్రజల అభిప్రాయం తీసుకున్నారా..అంటూ గ్రామంలో చర్చ నడుస్తోంది.



### పంచాయితీ కార్యదర్శి వివరణ....

గంగ బండ తండా పంచాయితీ పరిధిలోని రావిచెట్టు తండాలో నిర్మిస్తున్న సైడ్ డ్రైన్ల నిర్మాణంపై పంచాయితీ కార్యదర్శి ఉపేందర్‌ను ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా ఆ నిధులకు గ్రామ పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదు అవి ఎస్టీ నిధుల నుంచి చేస్తున్నారు. పిఆర్ లేక ఆర్అండ్‌బి అధికారులు నిర్వహణ అయి ఉండవచ్చు మేము ఆ విషయంలో ఎటువంటి జోక్యం చేసుకోలేము అని తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలి

-మొండికుంట పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని మొండికుంట పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం సేకరణ, తూకం విధానం, గన్నీ బ్యాగుల లభ్యత, రైతులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ కొనుగోళ్లు వేగవంతం చేసి కేంద్రాల వద్ద ఎక్కువ సేపు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. తడిగా ఉందనే కారణాలతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని, ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, తహసీల్దార్ సూర్య ప్రకాష్, ఏడిఏ తాతారావు, ఎంపీడీవో ముత్యాలరావు, సర్పంచ్ మర్రి సంధ్య, పీఏసీఎస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## రూ.85లక్షల సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

-సారపాకలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంఎల్‌ఏ పాయం
-ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలోని రాజీవ్‌నగర్, భాస్కర్‌నగర్ ప్రాంతాల్లో సుమారు రూ 85లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో రహదారి సదుపాయాలు కీలకమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని తెలిపారు. అనంతరం భూక్య అరుణ, తేజావత్ జానకి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని గృహాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజలకు అన్ని విధాల సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్, కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహిమద్ ఖాన్, సారపాక సర్పంచ్ గుగులోత్ శివరాం కిషోర్ నాయక్, బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన ప్రసాద్ కుమార్, ఇంగువ రమేష్, చల్లా వెంకటనారాయణ, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, తిరుపతి చంటి, ఐఎన్‌టియూసి నాయకులు యారం పిచ్చిరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు పేరాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లెలమడుగులో సబ్ కలెక్టర్ పర్యటన

-సర్పంచ్ మచ్చా నరసింహారావును అభినందించిన సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని మల్లెలమడుగు గ్రామ పంచాయితీని సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మంగళవారం సందర్శించారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ మచ్చా నరసింహారావు స్వాగతం పలికారు. గ్రామంలోని పారిశుద్ధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్న సబ్ కలెక్టర్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం జనన, మరణాల రిజిస్టర్, కళ్యాణ లక్ష్మీ రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి వాటర్ ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజలకు పంచాయితీ కార్యాలయంలో కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల సర్పంచ్‌గా ఎన్నికైన మచ్చా నరసింహారావును అభినందించిన సబ్ కలెక్టర్, గ్రామాభివృద్ధిపై ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమన్నారు. పంచాయతీ నిధుల్లో 10 శాతం గ్రీనరీ అభివృద్ధికి వినియోగించాలని, సామూహిక బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గాడిద మహేష్, పాలకవర్గ సభ్యులు కొమరం శ్రీను, పద్దం రాజు, రాములు, గ్రామస్తులు బచ్చు వెంకటరమణ, చెంచల రాము, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అండగా గుంపెన సహకార సంఘం

-ధాన్యం కొనుగోళ్ల సమస్య పరిష్కారానికి ఛైర్మన్ చర్యలు

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో గత కొన్ని రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో గుంపెన సహకార సంఘం ఛైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు రైతులతో కలిసి ఆందోళన చేపట్టి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మిల్లర్లు క్వింటాకు 8కేజీల కోత విధించగా రైతులు ఆందోళనకు దిగారు. దీంతో మిల్లర్లతో చర్చించి కోతను 5కేజీలకు తగ్గించి కొనుగోళ్లు ప్రారంభించేలా చేశారు. అయితే మిల్లర్ల వద్ద నిల్వ సామర్థ్యం లేకపోవడంతో ధాన్యం స్వీకరణలో ఇబ్బందులు తలెత్తాయి. ఇదే సమయంలో వర్షాలు రావడంతో ధాన్యం తడిసి రైతులకు నష్టం కలిగే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో గుంపెన సహకార సంఘం ఆధ్వర్యంలోని 750 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌ను ధాన్యం నిల్వ కోసం వినియోగించేలా అనుమతులు తీసుకొచ్చారు. అలాగే అన్నపురెడ్డిపల్లి మిల్లుకు అనుమతులు తెచ్చి సమీప కొనుగోలు కేంద్రాల ధాన్యాన్ని అక్కడికే తరలించేలా ఏర్పాట్లు చేశారు. లారీల కొరత నేపథ్యంలో ట్రాక్టర్ల ద్వారా ధాన్యం మిల్లులకు చేర్చే విధంగా చర్యలు చేపట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం మొత్తం మిల్లులకు తరలించేలా చర్యలు కొనసాగుతున్నాయని సుధాకర్‌రావు తెలిపారు. రైతులకు అండగా నిలిచిన ఆయనకు రైతులు అభినందనలు తెలియజేస్తున్నారు.





## అన్నపురెడ్డిపల్లి మండలంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** పెద్దిరెడ్డిగూడెం రైతు వేదికలో గుంపెన ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ బోయినపల్లి సుధాకర్ రావు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ఏడి రవికుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటల సాగుతో భూమి సారవంతం పెరిగి దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. సేంద్రియ సాగుతో ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. అయితే 50శాతం సబ్సిడీ వస్తుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. బయట మార్కెట్‌లో 30కేజీల విత్తనాల బ్యాగు రూ 3300 ఉండగా, సొసైటీ ద్వారా రూ 2452కు ఇవ్వడంతో పూర్తి స్థాయి సబ్సిడీ అందలేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనూష, ఏఈఓ సంధ్య, సీఈఓ శ్రీనివాసరావు, కొత్తూరు వెంకటేశ్వర్లు, చిన్న లక్ష్మణరావు, రైతులు, సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తమ సమస్యల పరిష్కారానికి సమ్మె కొనసాగింపు



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీ నుంచి సమ్మె చేపట్టినట్లు మండల వీవోఏఎస్ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కనీస వేతనం రూ 20వేలుగా నిర్ణయించాలని, ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సీసీలుగా గుర్తింపు కల్పించాలని, రూ 20లక్షల ఆరోగ్య భీమా అందించాలని, 58 జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు అమలు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈసందర్భంగా మండల సమాఖ్య కార్యాలయంలో సీసీ ఆధ్వర్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన సీరియర్ సీఆర్‌పీల పర్యవేక్షణలో ఐబీఎల్‌లకు ప్రజాపాలనపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆందోళనకారులు అడ్డుకున్నారు. తమకు మద్దతు ఇవ్వాల్సిన సమయంలో సమావేశాలు నిర్వహించడం సమంజసం కాదని మండల వీవోఏఎస్ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు అందరూ మద్దతుగా నిలవాలని కోరుతూ అధికారులను నిలదీశారు.

## బడిబాటలో భాగంగా కరపత్రాలు ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ఏన్కూరు:** బడి బాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బురద రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. మండల విద్యాశాఖ అధికారి నాగిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కరపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎంఈఓ నాగిరెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తూ, అన్నీ రంగాలలో ముందడుగు వేస్తున్నారని ఆయన అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. పాఠ్యాంశ, పాఠ్యాంశేతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సాగబోయిన రాణి, బరపటి వెంకటనారాయణ, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు సాగి సుజాత, ఉపాధ్యాయులు పొట్ట రామారావు, శ్రీనివాసరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలం జగన్నాధపురం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కృష్ణతేజ, శ్రవణ్ కుమార్ రైతులకు విశ్వ విద్యాలయం సూచించిన ఆరు ముఖ్యాంశాలతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రీయ ధృవీకరణ, తక్కువ నీటితో పండే ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. రైతులు సహకార సంఘాల ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తే మంచి ధర లభిస్తుందని, రైతు కేవలం వ్యవసాయదారుడిగానే కాకుండా వాటాదారుడిగా ఆలోచించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి అరుణ్ బాబు, వ్యవసాయ విస్తరణ అధికారి పి రమేష్ పాల్గొన్నారు.

# గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచాలి

**-విద్యుత్ శాఖ పనులపై కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ పనుల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్‌లో టిజి ఎన్‌పిడిసిఎల్, టిజి రెడ్ కో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. మిగిలిన అన్ని హాబిటేషన్లు, గృహాలకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటి కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ప్రత్యక్షంగా సందర్శించి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని అత్యంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి 100 మీటర్లను ఒక బ్లాక్‌గా గుర్తిస్తూ భవిష్యత్తులో నిర్వహణ, మరమ్మతులు అవసరమైన సమయంలో ఖచ్చితమైన ప్రాంతాన్ని సులభంగా గుర్తించేవిధంగా వ్యవస్థ రూపొందించాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ స్తంభాలపై కేబుల్, నెట్ లైన్లు ఉండటం వల్ల అంతరాయాలు కలగకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా కేబుల్ ఇంటర్నెట్ సేవల సంస్థలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో మున్సిపల్, తాగునీటి తదితర శాఖల పనుల సమయంలో భూగర్భ విద్యుత్ లైన్లు దెబ్బతినకుండా స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మోడల్ సోలార్ విజేల్‌లలో వ్యక్తిగత గృహాలు, ప్రభుత్వ సంస్థలు కలిపి మొత్తం 9,418 నిర్మాణాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటును వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 27 గ్రామాల్లో మొత్తం 4,371 మంది రైతులకు సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టిజి రెడ్‌కో పథకాలపై విస్తృత అవగాహన కల్పించి గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో టిజి ఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, టెక్నికల్ డిఈ బాబురావు, డిఈలు రామారావు, నాగేశ్వరరావు, రమేష్, భద్రుపవర్, శ్రీనివాసరావు, జిఎం అజయ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దామాల దయాకర్‌కు భారత కమ్యూనిస్టు పార్టీకి సంబంధం లేదు

**సిపిఐ నేత శింగు నరసింహారావు**



**ప్రజాపక్షం/కల్లూరు:** భారత కమ్యూనిస్టు పార్టీ కల్లూరు మండలం కార్యదర్శిగా ఉన్న దామాల దయాకర్ ను పార్టీ ప్రజాసంఘాల బాధ్యతల నుండి తొలగించుతూ జిల్లా పార్టీ నిర్ణయం తీసుకుందని జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహా రావు తెలిపారు. మంగళవారం కల్లూరులో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సిపిఐ మండల కమిటీ సభ్యులు కొత్తపల్లి వెంకటనారాయణ కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్లో వారు మాట్లాడుతూ పార్టీ పద్ధతులకు విరుద్ధంగా నిర్మాణరాహిత్యంగా ప్రవర్తించుతున్న కల్లూరు మండలం కార్యదర్శిగా ఉన్న దామాల దయాకర్ ను పార్టీ ప్రజా సంఘాల బాధ్యతల నుండి తొలగించుతూ పార్టీ జిల్లా కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నదని భారత కమ్యూనిస్టు పార్టీకి దయాకర్ తో సంబంధం లేదని తెలిపారు. కార్మికులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలలో పేర్కొన్న విధంగా మహిళలకు నెలకు రూ. 2,500/కళ్యాణ లక్ష్మి తులం బంగారం, ఆటో కార్మికులకు రూ. 12000/, పెన్షన్లు నెలకు రూ. 4000/ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. 10,000/ గ్రామపంచాయతీ, మున్సిపల్ వివోఏ లకు నెలకు కనీస వేతనం రూ. 26,000/ అమలు చేయాలని సమస్యలు పరిష్కారం కొరకు సిపిఐ పోరాడుతుందని ఆయా రంగాల ప్రజలు పోరాటాలో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

# ప్రజా ఉద్యమ నిర్మాణమే సుందరయ్యకు సరైన నివాళి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా ఉద్యమాలను నిర్వహించి ప్రజా ఆందోళనల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడమే దివంగత సిపిఎం నేత పుచ్చలపల్లి సుందరయ్యకు సరైన నివాళి అని సిపిఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రం తెలిపారు. దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా ప్రతినిధిగా, పార్టీ నాయకునిగా అచెంచల పోరాటాలు నిర్వహించారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభను ఖమ్మం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో విక్రం మాట్లాడుతూ సుందరయ్య తన ఆస్తులను ప్రజలకు పంపిణీ చేసిన నేత అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తూ పెట్టుబడిదారుల కొమ్ము కాస్తుందన్నారు. సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం




జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు, నాగ సులోచన, ఎస్‌కె సైదులు, మల్లికార్జున్, ఇమామ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీకి స్థలాన్ని అప్పగించాలి

**-టియుడబ్ల్యూజె టిజెఎఫ్ డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో గత క్యాబినెట్ ఆమోదంతో కేటాయించిన 23 ఎకరాల స్థలాన్ని ఖమ్మం హౌజింగ్ సొసైటీకి కేటాయించిన టియుడబ్ల్యూజె టిజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టియుడబ్ల్యూజె టిజెఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్వన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆది నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో కాలయాపన చేయడం మంచిది కాదని ఈ నెల 21న జరిగే క్యాబినెట్ ఆమోదం చేసి తక్షణం పంపిణీ చేయాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు కేటాయించాలని ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ నుండి అమర వీరుల స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి,




నాయకులు రమేష్, గోపి, కోటేశ్వరరావు, నాగరాజు, అశోక్, పానకాలరావు, కోటేశ్వరరావు, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో వల.. సిఐపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** భర్త వేధింపుల నుంచి తనను కాపాడి రక్షణ కల్పించాలంటూ ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిని ఓ వివాహితను వంచించి లోబరుచుకున్న ఖమ్మం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ భూక్యా రాజునాయక్ పై ఖమ్మం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసునమోదైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంభందించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని విడిఓస్ కాలనీకి చెందిన ఒక వివాహితకు భర్తతో విభేదాలు ఏర్పాడ్డాయి. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త వేధింపుల నుంచి తనను కాపాడి సమస్య పరిష్కారించాలంటూ మూడేళ్ల క్రితం ఆమె నగరంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆసమయంలో సిఐగా విధులు నిర్వహిస్తున్న రాజూ నాయక్ ఆమెను ప్రలోభాలకు గురిచేశాడు. ఆమె ఫిర్యాదులో తన సెల్ నెంబర్ ఇవ్వడంతో తరచూ ఫోన్ చేస్తూ న్యాయం చేస్తానంటూ మాటలు కలిపాడు. నిత్యం ఫోన్ చేయడమే కాకుండా మెసేజ్‌లు చేస్తూ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. అలా కొంతకాలం సహజీవనం చేశారు. ఆమె గర్భవతి కావడంతో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అందుకు సిఐ రాజు తిరస్కరించడంతో ఈనెల ఏడువ తేదీన టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. తనను లోబరుచుకోవడమే కాకుండా బలవంతంగా గర్భశ్రవ మాత్రలు మిగించి అబార్షన్ చేయించాడని, ఆర్థికంగా కూడా మోసగించాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కొద్ది రోజుల కిందటి వరకు ఖమ్మం సెంట్రల్ క్రైం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సదరు సిఐ రాజు నాయక్ విషయం వెలుగులోకి రావడంతో సెలవులో వెళ్లిపోయారు. ముదస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీనిని సీరియస్‌గా పరగణించిన ఉన్నతాధికారులు సిఐ రాజును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# రెండవ విడత దోస్త్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/మధిర :** మధిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ అడ్మిషన్ల రెండవ దశ కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్లకు ఈనెల 25 చివరి తేదీ కావడంతో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్లకు ఈనెల 26వ తేదీ వరకు అవకాశం ఉందని, మొదటి దశలో నమోదు చేసుకోలేని విద్యార్థులు రెండవ దశలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిహెచ్‌డి, సెట్, నెట్ అర్హతలు కలిగిన అధ్యాపక బృందం పనిచేస్తోందని తెలిపారు. విశాలమైన ప్రాంగణం, పచ్చనిచెట్ల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. కళాశాలలో చేరే విద్యార్థులు ఇతర వివరాలకు 94402557256, 944178508 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

# సొంతింటి కల నిజం చేసిన కాంగ్రేస్ ప్రభుత్వం : రేచర్ల



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు కావడంపై కాంగ్రేస్ పార్టీ యువ నాయకుడు రేచర్ల వెంకటేష్ నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞలు తెలియజేశారు. జూన్2వ తేదీన ఈ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించండి శుభపరిణామమన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ఇళ్లు లేక ఇబ్బందులు పడ్డ పేద కుటుంబాలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అండగా నిలిచిందని ఆయన కొనియాడారు. మన ఇళ్లు మన గౌరవం అనే నినాదంతో కాంగ్రేస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పేదల సొంతింటి కలను నిజం చేస్తుందని వెంకటేష్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ది చేకూరేలా ప్రభుత్వం పారదర్శకంగా ముందుకు సాగుతుందని రేచర్ల వెంకటేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పేదలకు నివాస భాగ్యం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందుతున్న లబ్దిదారుల ముఖాల్లో ఆనందం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో యువతరం ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు తాము శ్రమిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# టీఎస్ఆర్‌జెసి ఫలితాల్లో త్రివేణికి రాష్ట్రస్థాయి ర్యాంకులు

**ప్రజాపక్షం / ఖమ్మం విద్యావిభాగం :** ఇటీవల విడుదలైన టీ ఎస్ ఆర్ జె సి పలితాల్లో నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు ఉత్తమ పలితాలను సాదించారు. ఈ పలితాల్లో సి హెచ్ సాయి దీక్షిత్ 117 మార్కులతో రాష్ట్ర స్తాయిలో 21వ ర్యాంకు, కె.రిషిత 111 మార్కులతో 27వ ర్యాంకు, హరి చందన 110 మార్కులతో 32వ ర్యాంకు, హర్ష వర్దన్ 112 మార్కులతో 38 వ ర్యాంకు, దేవి వెంకట సాయి 110 మార్కులతో 46వ ర్యాంకు, 100 ర్యాంకుల లోపు 10 మంది విద్యార్థులు, 1000 ర్యాంకుల లోపు 16 మంది విద్యార్థులు సాదించి త్రివేణి పాఠశాలను అగ్రభాగాన నిలిపారు.ఉత్తమ పలితాలను సాదించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గోల్లపూడి వీరేంద్ర చౌదరి అబినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ యార్లగడ్డ వేంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సి ఆర్ ఓ మురళీకృష్ణ, సిబ్బంది స్వప్న, ము స్తాపా, చార్లెస్ ,సందీప్ తదితరులు పాల్గోన్నారు.

# బొగ్గు రవాణాలో కెసిహెచ్‌పిది కీలక పాత్ర



**-మల్టీ- డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్**
**-మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్ట్మెంట్ బృందం**

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మల్టీ డిపార్ట్మెంట్ బృందం తనిఖీ బృందం మణుగూరు ఏరియా కెసిహెచ్‌పిను సందర్శించి ఉద్యోగులకు, అధికారులకు మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మల్టీ డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామ చందర్ (జిఎం) ముందుగా కెసిహెచ్‌పిలో ప్రసంగిస్తూ బొగ్గు రవాణాలో కెసిహెచ్‌పి కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి బొగ్గు సరఫరాలో, రవాణాలో ఎలాంటి ఆటంకం కలుగకుండా యంత్రాల పనితీరును అనుక్షణం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కెసిహెచ్‌పి పని తీరు ప్రతి క్షణం ఎంతో విలువైనది కాబట్టి బ్రేక్ డౌన్ జరిగే అవకాశాలను ముందు గానే పసిగట్టి వెంటనే తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే ఏదేని కారణం వల్ల బ్రేక్ డౌన్ జరిగిన ఎడల వెంటనే మరమ్మత్తులు జరిపేందుకు సంబంధిత అదనపు పరికరాలు ముందస్తుగానే సిద్ధంగా ఉంచుకోవాలి అన్నారు. ముఖ్యంగా బొగ్గు రవాణాలో వినియోగదారులకు సంతృప్తి కలిగేలా నాణ్యమైన బొగ్గును అందించేందుకు సెల్ పిక్కింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి అన్నారు. అలాగే నిత్యం బొగ్గు లోడింగ్ ప్రక్రియలో పాల్గొనే కార్మికుడు, సూపర్వైజర్లు ఎల్లప్పుడూ పూర్తి స్థాయిలో రక్షణ పరికరాలు ధరిస్తూ, రక్షణ పరిధిలో పని చేయాలి అన్నారు. అలాగే దుమ్ము, ధూళి మరియు వాయు కాలుష్యంతో ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతినకుండా అనునిత్యం కేసిహెచ్‌పి ప్రాంగణంలో, పరిసరాలలో వాటర్ స్ప్రెయింగ్ చేస్తుండాలని సూచించారు అన్నారు. అలాగే వాయు కాలుష్య నివారణలో వృక్షాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి కాబట్టి కెసిహెచ్‌పి పని ప్రదేశాలలో, పరిసర ప్రాంతాల్లో విరివిగా మొక్కలను నాటి వాటిని పరిరక్షిస్తూ వృక్ష సంపదను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కెసిహెచ్‌పి నుండి నిర్దేశించిన బొగ్గు రవాణా లక్ష్యాలను సాధించడానికి ఉద్యోగులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అలాగే కెసిహెచ్‌పి పరిసర ప్రాంతములను పరిశుభ్రముగా మరియు పర్యావరణానికి మెరుగుపర్చడానికి తగిన చర్యలు తీసుకుంటునందుకు కెసిహెచ్‌పి అధికారులను మరియు ఉద్యోగులను జిఎం అభినందించారు. మణుగూరు ఏరియా కెసిహెచ్‌పి వార్షిక బొగ్గు రవాణా లక్ష్యం గురించి పవర్ పాయింట్ ప్రేసెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే ఈ రోజు 2వ షిఫ్ట్ లో పికేఓసి4 నందు ఉద్యోగులతో మాట్లాడుతూ 202627 సంవత్సరంలో మణుగూరు వార్షిక ఉత్పత్తి లక్ష్యమైన 96.26 లక్షల టన్నులు మరియు సింగరేణి వ్యాప్తంగా 65 మిలియన్ టన్నులను సమిష్టి కృషితో సాధించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రక్షణతో సాధించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచిస్తూ కంపెనీ ముందున్న సవాళ్ళు మరియు ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా తదితర అంశాల పై పవర్ పాయింట్ ప్రేసెంటేషన్ ద్వారా కూలంకషంగా వివరించడం జరిగింది. సింగరేణి వ్యాప్తంగా మరియు మణుగూరు ఏరియాకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా మరియు ఓబి వెలికితీత వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి, ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, పీఓ పికేఓసి ఎం. రమేష్, ఏజిఎం(ఈఈడు) సిహెచ్. రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ , డిజిఎం(కెసిహెచ్‌పి) వి.మధన్ నాయక్, ఆర్.ఎస్. గౌడే, డిజిఎం(క్వాలిటీ) నాగ రమేష్, ఓసీ 4 మేనేజర్ శ్రీ రమణారెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, ఇతర అధికారులు, అలాగే గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసి) వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, డిజిఎం(కెసిహెచ్‌పి) వి.మధన్ నాయక్, ఓసి 2 సంక్షేమ అధికారిచంద్రకిరణ్, కెసిహెచ్‌పి ఫస్ట్ షిఫ్ట్, నైట్ షిఫ్ట్ అండ్ ఓసి4 సెకండ్ షిఫ్ట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


# పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు..!

**- మొక్కలు నాటిన ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** పచ్చదనంతోనే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, ఇది కేవలం చెట్ల పెంపకం ద్వారానే సాధ్యమని, ప్రతీ ఒక్కరూ చెట్లను నాటేందుకు ముక్కువ చూపాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. జన్ జాతీయ గరిమ ఉత్సవ 2026, జన్ భాగీదారి సబ్సే దూర్ సబ్సే పహలే కార్యక్రమంలో భాగంగా యూనిట్ అధికారులతో కలిసి ఆయన మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియా పరిధిలోని 130 గిరిజన గ్రామాల్లో జన్ జాతీయ గరిమ ఉత్సవ్ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాలకు మౌళిక వసతులు కల్పించేందుకు ఈనెల 19 నుండి జాతీయ గరిమ ఉత్సవాలను ప్రారంభించి 25వ తేది వరకు నిర్వహిస్తుందోని తెలిపారు. ఇందులో భాగంగా ఆయా గిరిజన గ్రామాలకు అధికారులు చేరుకుని కావాల్సిన మౌళిక వసతులను తెలుసుకుంటారని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతీ ఒక్కరూ ఒక చెట్టును నాటి వాతావరణం కలుషితం కాకుండా చూడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రాణవాయువు ఇచ్చే మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్రాజు, డిడి అశోక్, ఇఇ మధుకర్, గన్య, ఎస్‌డిసి ఆనంద్‌కుమార్,ఉదయ్‌కుమార్, మనిధర్, భారతీదేవితో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేతనాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



**- ఉప సర్పంచ్ నిర్వాకంతో రెండు నెలలుగా వేతనాల బకాయి**

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** చుంచుపల్లి మండల పరిధిలోని ఎన్‌కే నగర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు గత రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామ పంచాయతీలో మొత్తం తొమ్మిది మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగా ప్రతి నెల 10వ తేదీలోపు వారి ఖాతాల్లో జీతాలు జమయ్యేవి, అయితే గత రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ సంతకం చేసినప్పటికీ, ఉప సర్పంచ్ డిజిటల్ ఓటీపీ ప్రక్రియ పూర్తికాక పోవడంతో జీతాల చెల్లింపులు ఆగిపోయినట్లు సమాచారం. ఓ ఇంటికి కుళాయి కనెక్షన్ మంజూరు చేసిన విషయంపై ఉప సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంప్ ఆపరేటర్ జీతం నిలిపివేయాలని సూచించినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ కుళాయి వ్యవహారమే సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య విభేదాలకు దారితీసిందని, దాని ప్రభావం పారిశుద్ధ్య కార్మికుల జీతాలపై పడిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై సర్పంచ్ శ్రీకాంత్ జిల్లా పంచాయతీ అధికారిణి విద్యాచందనకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఉప సర్పంచ్ మాలోత్ లక్ష్మి , ఆమె కుమారుడు సంపత్ కారణంగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, ఇతర బిల్లులు కూడా రెండు నెలలుగా నిలిచిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదు నేపథ్యంలో డీఎల్పీఓ కీర్తి ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వసంత, ఎంపీఓ సంధ్య మంగళవారం ఎన్‌కే నగర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని విచారణ నిర్వహించారు. రెండు నెలలుగా జీతాలు అందరక కుటుంబ పోషణ కష్టంగా మారిందని, వెంటనే తమ ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని పారిశుద్ధ్య కార్మికులు అధికారులను కోరారు. విచారణ చేపట్టిన పై అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వాసిని వీరయ్య మృతి బాధాకరం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కాకర్ల సిపిఐ సీనియర్ నాయకులు, వాసిని వీరయ్య మృతి బాధాకరం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ అన్నారు. కాకర్ల గ్రామంలో వాసిని వీరయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ తుది శ్వాస వరకు ప్రజలకోసం పనిచేసిన అమరుల ఆదర్శంగా ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేపట్టారని అన్నారు. వాసిని వీరయ్య లేని లోటు కుటుంబానికే కాక సిపిఐ పార్టీ కూడా తీరని లోటు అని అన్నారు. పార్టీలో అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. త్యాగధనులు అందించిన ఎర్రజెండాని కాకర్ల ప్రాంతంలో సగర్వంగా నిలబెడదాం అని, కుటుంబ సభ్యులకు అండగా కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని తెలిపారు. నివాళులర్పించినవారిలో కాకర్ల గ్రామ శాఖ కార్యదర్శి చిమాట ముత్తయ్య, ఉదరి నాగయ్య, బెజవాద సీతయ్య, కంప సాటి నాగేశ్వరరావు, ముత్తిలింగం, బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

# పోలీసులకు కాల్పుల అభ్యాసం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో పోలీసులకు కాల్పులపై అభ్యాసం ఇస్తున్నారు. ఏడాదికొక సారి జరిగే ఈ కార్యక్రమాన్ని మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రారంభించారు. పోలీసులు శాఖలో వినియోగించే అన్ని రకాల ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తారు. జిల్లాలోని మొత్తం 1469 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ కాల్పుల అభ్యాసంకు హాజరకానున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం ప్రజలకు సేవలు అందిస్తూ విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతీ ఏటా పోలీస్ శాఖలో వినియోగించే ఆయుధాలతో జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురంలో అభ్యాసం చేస్తున్నారు. విడతల వారీగా జిల్లాలోని పోలీస్ సిబ్బంది ప్రతీ ఒక్కరూ ఈ అభ్యాసం కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొత్త కొత్తూరు గ్రామంలో మంగళవారం ఉద్యమకారులు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీని ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, చైర్మన్ కె.కేశవరావుకు, ఎమ్మెల్సీలు కోదండరామ్, అద్దంకి దయాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇండ్ల స్థలం, రూ.25 వేల పెన్షన్, హెల్త్ కార్డులు, బస్ పాస్‌లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు ఎం.వెంకటేశ్వర రావు, రాములు, ఆంజనేయులు, యాకయ్య, వెంకటేశ్వర్లు, కోటయ్య పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/మణుగూరు:** తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఉడతానేని నగర్, రిక్షా కాలనీ ప్రాంతాలలో ఏర్పాటు చేయబోయే నూతన తాగునీటి బోర్ పాయింట్లను పరిశీలించి గుర్తించారు. ఈ ప్రాంతాలు అత్యంత నీటి ఎద్దడి సమస్యతో బాధపడుతున్న ప్రాంతాలుగా గుర్తించబడిన నేపథ్యంలో, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బోర్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు మాదాడి రాజేష్, వేల్పుల నరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుంధతి, జియాలజిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని తురకగూడెం గ్రామంలో కిష్టాపురం వైపు వెళ్లే ప్రధాన బజారు ప్రాంతం నెలల తరబడి మురుగునీటితో నిండిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలోనే మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపించి, దోమలు పెరిగి ప్రజలు ఆరోగ్య భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ గ్రామ పంచాయితీ అధికారులు, ముఖ్యంగా కార్యదర్శి సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రెండు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మార్గం కావడంతో ప్రతి రోజూ వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మురుగు నీటి కారణంగా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. మరుగునీరు రోడ్లపైకి రావడంతో చిన్నారులు, వృద్ధులు జారిపడి రోడ్లపైకి రావడంతో చిన్నారులు, వృద్ధులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి శాశ్వత చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన కొందరు గ్రామ పెద్దలు, అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేయడం తగదని తమ నిరసన తెలియజేస్తున్నారు.

# కెసిఆర్ ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు..

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రేవంత్ పోవాలి కేసిఆర్ రావాలి అనే నినాదంతో ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 44వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ లోకి పలువురు చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ హామీల పేరుతో మోసం చేసి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకోవడం కాదని ప్రజలు ఏమి చేశారో చెప్పాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నేతలు మేము చేశామని ఫ్లెక్సీలు, బ్యానర్లు వేసుకుని ప్రచారం చేస్తున్నారని దీనిని ఖమ్మం ప్రజలు గమనిస్తున్నారన్నారు. అన్ని మతాలకు, అన్ని వర్గాలకు న్యాయం చేసిన పార్టీ బిఆర్ఎస్ అని తెలిపారు. కష్టపడి జీవనం సాగించే పేదలు తనతో కలిసి నడిచారన్నారు. 44వ డివిజన్‌లో పేదలను కాంగ్రెస్ నాయకులు ఇబ్బందులకు గురి చేశారని అయినా గుండె ధైర్యంతో తన వెంటే నిలబడ్డారని అజయ్‌కుమార్ తెలిపారు. మార్పు మార్పు అంటూ చెప్పిన కాంగ్రెస్ ఏమి మార్చారో ప్రజలకు చెప్పాలన్నారు. అపరిశుభ్రంగా నగరాన్ని తయారు చేశారన్నారు. వెలుగుమట్లలో పేదల ఇండ్లు కూల్చి కబ్జాదారులకు అప్పగించేందుకు ప్రయత్నించారని దానిని ప్రతిఘటిచినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్ మంజూరు చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఊరూ వాడ తిరిగి పార్టీ కోసం పని చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తామన్నారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మరల ముఖ్యమంత్రి కేసిఆర్ అవుతారన్నారు. సభ్యత్వ నమోదులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మహ్మద్ మోయిన్, జాని, సాయి, సోహెల్, జావీద్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, తాజుద్దీన్, మగ్బూల్, బచ్చు విజయ్‌కుమార్, బత్తుల మురళి, శీలంశెట్టి వీరభద్రం, బుర్రి వెంకటేశ్వర్లు, బుర్రి వినయ్, బుడిగెం శ్రీను, పాలడుగు పాపారావు, గొల్లపూడి రాంప్రసాద్, మాటేటి కిరణ్, మోరంపూడి సాయి, షకీనా, ఖదీర్, మోహన్‌రావు, షకీల్, గౌరీనాథ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోయగూడెం చెరువును కబళిస్తున్న మట్టి మాఫియా..!

**-రాత్రివేళల్లో యథేచ్ఛగా తవ్వకాలు**
**-అధికారులు స్పందించకపోతే ప్రాణ నష్టం తప్పదు అంటూ గ్రామస్తులు ఆవేదన**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఒకప్పుడు గ్రామానికి జీవనాధారంగా నిలిచిన కోయగూడెం చెరువు ఇప్పుడు అక్రమ మట్టి తవ్వకాలతో ప్రమాదకర ప్రాంతంగా మారుతోంది. చెరువును కాపాడాల్సిన చోట మట్టి మాఫియా జేసీబీలు, హిటాచీలతో లోతుగా తవ్వేయడంతో భారీ గుంతలు ఏర్పడి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం రాత్రివేళల్లో వందల ట్రిప్పుల మట్టిని టిప్పర్ల ద్వారా రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. 15 నుంచి 20 అడుగుల లోతు వరకు తవ్వేయడంతో చెరువు స్వరూపమే మారిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిసరాల్లోని పచ్చని చెట్లు నేలకొరిగిపోతుండగా, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని చెబుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ లోతైన గుంతల్లో పశువులు, చిన్నారులు ప్రమాదవశాత్తు పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు ఎందుకు స్పందించడం లేదు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, కొందరు అధికారుల అండతోనే మట్టి మాఫియా రెచ్చిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక సర్పంచ్ కొండమ్మతో పాటు గ్రామస్తులు అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా జోక్యం చేసుకుని చెరువును పరిరక్షించాలని కోరుతున్నారు. గ్రామ ప్రజల జీవనాధారమైన చెరువును కాపాడాలనే విజ్ఞప్తి ఇప్పుడు అధికార యంత్రాంగం ముందున్న పెద్ద సవాలుగా మారింది.

# ఉపాధి కూలీల మౌలిక సమస్యలను పరిష్కరించండి

**వ్య.కా.స. రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నవరపు**
**ఎంపిడివో కార్యాలయం ముందు ధర్నా**



**ప్రజాపక్షం/మణుగూరు:** ఉపాధి కూలీల మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు కు సమర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజివిక మిషన్ గ్రామీణ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిచేస్తున్న కార్మికుల యొక్క హాజరు యాప్ ఆధారంగా రోజులో రెండుసార్లు ఫోటోలు తీసి మాస్టర్ వేసే పద్ధతి వల్ల ఉపాధి కూలీలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో చేసిన పనికి కూడా మస్టర్ నమోదు కావడం లేదని, వెంటనే రెండుసార్లు ఫోటోలు తీసే మస్టర్ నమోదు చేసే పద్ధతి వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండుటెండల్లో ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో చేతులకు బొబ్బలు వచ్చేలా పనులు చేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు కూడా సకాలంలో అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో నిలువ నీడ కూడా లేకుండా కూలీలు పనులు చేస్తూ మండుటెండల్లో మగ్గిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు మంచినీళ్లు, టెంటు, మెడికల్ కిట్లు, పనిముట్లు కనీస మౌలిక సౌకర్యాలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి కార్డుతో సంబంధం లేకుండా 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు వారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి, నైనారపు నాగేశ్వరరావు, బొల్లం రాజు, సంకినేని వెంకట్రావు, తోట పద్మ, కనితి సత్యనారాయణ, బండారి స్వరూప, పొడుతూరి సునీత, చీమల మల్లయ్య, కనకం సరిత, కొప్పుల మాధవి పాల్గొన్నారు.

# కాకరవాయిలో సమగ్ర భూ సర్వేల తనిఖీ



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం లోని కాకరవాయి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వేలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భూ సర్వేలను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సర్వేయర్లకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి భూమి వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే కార్యక్రమం ద్వారా భూ వివాదాలు తగ్గడంతో పాటు రైతులకు భూమి హక్కుల పరిరక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్వే సందర్భంగా భూమి హద్దులు, రికార్డుల నమోదు, మ్యాపింగ్ విధానాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి రాజేందర్, తహసిల్దార్ లూథర్ విల్సన్, డిప్యూటీ తహసిల్దార్ సుధీర్, ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు పవన్ కుమార్ లక్ష్మణ్, ఎంపీవో ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నల కొనుగోళ్లు వేగంగా చేపడుతున్నాం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్నలు కొనుగోళ్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. అన్ని రకాలు ఏర్పాట్లతో పాటు రవాణా సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 376288 క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 219729.5 క్వింటాళ్లను గోదాములకు తరలించినట్లు చెప్పారు. మంగళవారం ఒక్కరరోజే 10091.5 క్వింటాళ్లు గోదాములకు తరలించామన్నారు. రవాణా కోసం 458 లారీలు, 131 ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని, మరో 1.50 లక్షల క్వింటాళ్ల వరకు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇల్లెందు, □ల్లెందు, లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, జూలూరుపాడు, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. కొనుగోళ్లకు సంబంధించి రైతుల ఖాతాల్లో నగదు వేగంగా జమయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

# ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించిన గిరి దర్శన్ బృందం




**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియాన్ని గిరి దర్శన్ బృందం మంగళవారం సందర్శించింది. జిల్లాలోని హెడ్ క్వార్టర్‌లో పౌర రక్షణశాఖ ఆధ్వర్యంలో గిరిదర్శన్ శిక్షణ పొందుతున్న గిరిదర్శక్ బృందం టూరిస్ట్ గైడ్ సభ్యులు శిక్షణలో భాగంగా మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో పొందుపరిచిన కళాకండాలు, సంస్కృతి సంప్రదాయాల కళాకృతులు, క్రాఫ్ట్ తయారీ విధానాన్ని, పురాతన వస్తువులను తిలకించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను సజీవంగా ఉంచేందుకు మ్యూజియాన్ని ఏర్పాటు చేసిన ఐటిడిఏ పిఓ కృషి అభినందనీయమని బృందం అభిప్రాయపడింది. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, మాధవి, స్రవంతి, సందీప్‌కుమార్, ఉదయ్‌కుమార్, రవి, ముత్యాల్రావు, దేవా, వర్షసందీప్, అపక్క సాంబ పాల్గొన్నారు.

# అలెక్స్ జ్ఞాపకార్థం వాటర్ ట్యాంక్ ప్రారంభం



**ప్రజాపక్షం/మణుగూరు:** మియ్య శ్రీనివాస్ (ఐటిఐ లెక్చరర్) కుమారుడు అలెక్స్ ఇటీవలి కాలంలో మరణించిన నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం ఐటిఐ విద్యార్థులకు శాశ్వతంగా ఉపయోగపడే విధంగా మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అలాగే 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ ఐటిఐ మణుగూరు అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రారంభాన్ని కూడా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలెక్స్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అలాగే ఐటీఐ విద్య ద్వారా యువత నైపుణ్యాలను పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను సాధించవచ్చని తెలిపారు. యువత అందరూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి రవి, సూపర్డెంట్ జ్యోతి, రాణి, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, తోగ్గుడెం సర్పంచ్ మడకం క్రిష్ణ, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ దొబ్బల వెంకటప్పయ్య, ఎస్ గణేష్ రెడ్డి, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.